www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 29 సెప్టెంబరు 2023



ఎంఎస్.స్వామినాథన్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు

ఎంఎస్.స్వామినాథన్ మృతికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపం తెలిపారు. హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ మృతి బాధాకరమన్నారు. ఆహారవృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించడంలో ఆయన ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తన పరిశోధనలతో మేలైన వంగడాలు సృష్టించారని తెలిపారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ వంటి ఎన్నో పురస్కారాలు అందుకున్నారని తెలిపారు. ఆయన మృతి దేశానికి ఎంతో లోటని అభిప్రాయపడ్డారు.

రుణాలు అరకొరే..!


కౌలు రైతులకు మొండిచేయి
పట్టించుకోని ప్రభుత్వం
కౌలుకార్డులు జారీచేసినా
రుణాలివ్వని పరిస్థితి
ఏలూరు జిల్లాలో 58 వేల
కౌలుకార్డుదారుల్లో 13 వేల
మందికే లబ్ధి
'పశ్చిమ'లో 88వేల మందిలో 26 వేల
మందికే రుణాలు
ప్రయివేటు వడ్డీవ్యాపారుల
కబంధహస్తాల్లో కౌలురైతులు

రెండు జిల్లాల్లోనూ వ్యవసాయసాగులో కీలక పాత్రపోషిస్తున్న కౌలురైతుల గురించి పట్టించుకునే నాధుడే లేకుండాపోయాడు. పంటసాగుచేస్తున్న వాస్తవ కౌలురైతులకు పంటరుణాలందని పరిస్థితి నెలకొంది. అరకొర రుణాలు మంజూరు చేసి బ్యాంకులు చేతులు దులుపుకుంటున్నాయి. వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతుల పరిస్థితి మరింతదారుణంగా తయారైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూయజమానులకు అవగాహన కల్పించడంలోగానీ, కౌలుకార్డులు జారీచేసిన రైతులకు రుణాలిప్పించేందుకు చర్యలు తీసుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. బ్యాంకురుణాలందకపోవడంతో పెట్టుబడుల కోసం కౌలురైతులు ప్రయివేటు వడ్డీవ్యాపారుల కబంధహస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండుజిల్లాల వ్యవసాయసాగులో కౌలురైతులదే కీలకపాత్ర. సాగుచేస్తున్న భూమిలో 75 శాతం సాగు కౌలురైతులే చేస్తున్నారు. ఇంత పెద్దమొత్తంలో సాగుచేస్తున్న కౌలురైతుల గురించి మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కౌలుకార్డుల జారీ, పంటరుణాల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. 2023-24 ఆర్థికసంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకూ బ్యాంకులు కౌలురైతులకు జారీచేసిన రుణాలు లెక్కలు చూస్తే పరిస్థితి ఏమిటో అర్థంచేసుకోవచ్చు. అరకొరగా రుణాలు జారీచేసి బ్యాంకులు చేతులు దులుపుకుంటున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో కొంత ఫర్వాలేదనిపించినప్పటికీ, ఏలూరు జిల్లాలో మాత్రం కౌలురైతుల పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏలూరు జిల్లాలో 58,452 కౌలుకార్డులు జారీచేసినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నాయి. కౌలుకార్డులు జారిచేసిన రైతులకైనా రుణాలిచ్చారా అంటే అదీలేకుండా పోయింది. కేవలం 13వేల మందికి మాత్రమే రూ.52కోట్ల వరకూ రుణాలు మంజూరుచేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. దాదాపు కౌలుకార్డులు అందుకున్న 45వేల మంది కౌలురైతులకు రుణాలందని పరిస్థితి నెలకొంది. వీరంతా పంటరుణాల కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో 88వేల మంది కౌలురైతులకు కౌలుకార్డులు మంజూరు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి. బ్యాంకు రుణాలు అందుకున్న కౌలురైతులు 26 వేల మంది మాత్రమే. వీరికి మంజూరు చేసిన రుణాలు రూ.130 కోట్లు మాత్రమే. కౌలుకార్డులు అందుకున్న దాదాపు 60వేల మందికిపైగా కౌలురైతులకు రుణాలివ్వ లేదు. ఈ జిల్లాలో జెఎల్‌జిఎల్, ఆర్ఎంజిఎల్ గ్రూపుల ద్వారా రూ.195 కోట్ల వరకూ రుణాలిచ్చినట్లు తెలుస్తోంది. ఇది రైతులకు కొంత ఉపశమనం కల్పించే చర్యగా చెప్పొచ్చు. ఏదిఏమైనా వ్యవసాయ రుణ ప్రణాళికల్లో కౌలురైతులకు కేటాయించిన రుణాలు ఒక్కశాతం కూడా లేకుండాపోయింది. కనీసం కౌలుకార్డులు జారీచేసిన రైతులకు కూడా రుణాలివ్వకపోడం అత్యంత దారుణంగా చెప్పొచ్చు. దీంతో పెట్టుబడులకోసం కౌలురైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.



ప్రయివేటు వడ్డీ వ్యాపారుల కబంధహస్తాల్లో కౌలురైతులు

వాస్తవసాగుదారుడైన కౌలురైతులకు బ్యాంకులు పంటరుణాలందించడం లేదు. అరకొర రుణాలు జారీచేసి బ్యాంకులు మమ అనిపిస్తున్నాయి. ప్రభుత్వం సైతం కౌలురైతులకు రుణాలు మంజూరు గురించి గట్టి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కౌలురైతులు పెట్టుబడులకోసం ప్రయివేటు వడ్డీవ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. నూటికి రూ.మూడు, రూ.ఐదు వడ్డీకి అప్పులు తెచ్చి కౌలురైతులు వ్యవసాయం చేస్తున్నారు. దీంతో వడ్డీభారం తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. ప్రతిఏటా ప్రకృతివైపరిత్యాలతో పంటలు దెబ్బతినడంతో అప్పులు తీరక, వడ్డీ భారంగా మారుతోంది. దీంతో కౌలురైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కౌలురైతుల రుణాల జారీకి సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటేనే కౌలురైతులకు ఎంతోకొంత న్యాయం జరుగుతుందని రైతులు భావిస్తున్నారు.

పక్కా ప్రణాళికతో జగనన్న ఆరోగ్య సురక్ష

30న 25 గ్రామాల్లో క్యాంపుల ఏర్పాటు - కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వెల్లడి

ప్రజాశక్తి - ఏలూరు




మాట్లాడుతున్న కలెక్టర్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ నెల 30వ తేదీన ప్రారంభమవుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి నోడల్ అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వైద్య ఆరోగ్య సిబ్బందితో గురువారం ఏలూరు కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణ కోసం పక్కా ప్లానింగ్‌తో సిద్ధం చేసుకోవాలన్నారు. ఇందుకోసం స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రాసెస్ (ఎస్ఒఎస్) ప్రకారం ఎవరెవరికి కేటాయించిన విధులను వారు పక్కగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు మ్యాన్ పవర్ ప్లానింగ్ తయారు చేసుకోవాలని సూచించారు. హెల్త్ స్క్రీనింగ్ కోసం ఐదు విభాగాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. హెల్ప్ డెస్క్ రిజిస్ట్రేషన్ డాక్టర్ ఎలాట్‌మెంట్ కనెక్షన్ గదులు, ల్యాబ్ టెస్ట్, కంటి విభాగం, స్కానింగ్ తదితర కౌంటర్లతో పాటు ప్రత్యేకంగా ఆరోగ్యశ్రీ, న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. క్రౌడ్ మేనేజ్‌మెంట్ కోసం స్థానిక హెచ్ఎస్‌హెచ్ఒతో సమన్వయం చేసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పూర్తికాని మండలాల్లో శుక్రవారం సాయంత్రానికల్లా నూరు శాతం పూర్తి చేసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ యాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ అయింది లేనిదీ పరిశీలించి, యుహెచ్ఐడి కార్డ్‌లో లాగిన్ చేయించాలన్నారు. సర్వే అయినవారికి ఎంపిహెచ్ఎస్ ద్వారా కేసు ఇచ్చి సర్వే కాని వారికి ఎఎన్ఎం సిహెచ్ఒ అప్‌లోడ్ చేసి డిజిటల్ అసిస్టెంట్ ద్వారా కేసు షీట్ డౌన్లోడ్ చేసి వీరు ఇరువురి మెయిన్ సూపర్‌వైజర్ వద్దకు పంపాలన్నారు. వారు కేస్ షీట్ పరిశీలించి సంబంధిత వైద్యుల వద్దకు పంపుతారని తెలిపారు. ఈ హెల్త్ స్క్రీనింగ్ క్యాంపునకు వచ్చేవారికి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వయోవృద్ధులకు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు త్వరితగతిన స్క్రీనింగ్ చేయాలన్నారు. శిబిరం వద్ద రెండు మూడు వీల్ చైర్లు కూడా ఏర్పాటు చేసుకోవాలని, ఆపదమిత్ర సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. శిబిరంలో నలుగురు వైద్యులు అందుబాటులో ఉంటారని, వారిలో ఇద్దరు జనరల్ మెడిసిన్, మరో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు ఉంటారన్నారు. కేంద్రానికి వచ్చిన స్పెషలిస్ట్ డాక్టర్లకు ఉన్న సదుపాయాలను, ఇసిజి మీటర్, టెస్టింగ్ మీటర్లను వారికి చూపించాలని తెలిపారు. వైద్యులకు బ్లౌజులు మాస్కులు అందించడంతోపాటు వారికి విశ్రాంతి రూము, భోజనం ఏర్పాటు చేయాలన్నారు. టోకెన్ జనరేషన్‌లో సమయాన్ని కేటాయించే స్లాట్స్ నిర్దేశించాలన్నారు. ప్రతిశిబిరంలో మూడు నాలుగు కంప్యూటర్లు, ప్రింటర్‌తో సహా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అవసరమైన పారిశుధ్య సిబ్బందిని నియమించుకోవాలని, ముఖ్యంగా మ్యాన్‌పవర్ ప్లానింగ్ చేసుకోవాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద రిఫరల్ చేస్తే సంబంధిత నోడల్ అధికారి, ఎంపిడిఒ ఫాలోఅప్ చేసుకోవాలని తెలిపారు. తహశీల్దార్, ఎంపిడిఒలతో కూడిన బృందాలు ఎక్కడైతే ఆరోగ్య సురక్ష నిర్వహిస్తారో అక్కడకు ఒకరోజు ముందుగానే వెళ్లి చెక్‌లిస్ట్ ప్రకారం పరిశీలించి నివేదిక అందజేయాలన్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కావాలని, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ శర్మిష్ట, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, కంటి విభాగం అధిపతి డాక్టర్ మల్లికార్జునరావు, అదనపు డిఎంహెచ్ఒ రాజీవ్, డిఐఒ నాగేశ్వరరావు, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ పాల్గొన్నారు.

జిల్లాకు యుటిఎఫ్ స్వర్ణోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - చింతలపూడి



చింతలపూడిలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్

విజయవాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ శ్రీకాకుళంలో ప్రారంభమైన ప్రచారయాత్ర గురువారం చింతలపూడి పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన సెంటర్‌లో యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్ర ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం మండలాల్లో సాగింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, ముస్తాఫాఅలీ, టి.నరసాపురం, చింతలపూడి మండలాల యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : యుటిఎఫ్ స్వర్ణోత్సవాల ర్యాలీ గురువారం ఉదయం ద్వారకాతిరుమల చేరుకుంది. ఈ సందర్భంగా యుటిఎఫ్ భవనంలో జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ స్వర్ణోత్సవాల సందర్భంగా విజయవాడలో వచ్చేనెల ఒకటో తేదీన పదివేల మందితో సభ నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.గోపీమూర్తి, జిల్లా ప్రధానకార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఆర్‌డిఒ

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి


ప్రజాశక్తి - భీమడోలు

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి కోరారు. భీమడోలు మండలంలో ఈనెల 30వ తేదీ నుంచి ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, గ్రామ సచివాలయ అధికారులు, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామసచివాలయాల వారీగా ఆరోగ్య క్యాంపులను నిర్వహించనున్నామన్నారు. సూరప్పగూడెం సచివాలయం వద్ద ఈనెల 30వ తేదీన మొట్టమొదటి ఆరోగ్య క్యాంపును ప్రారంభించనున్నామన్నారు. ఈ క్యాంపుల్లో అవసరమైన సహాయక సహకారాలను అందించేందుకు మండలస్థాయి అధికారుల సభ్యులుగా గల రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పథకంలో భాగంగా ఇంటింటికీ వైద్య సేవలు, వైద్యుల సంప్రదింపులు, మందుల పంపిణీ కార్యక్రమాలు ఉంటాయన్నారు. దీనిలో భాగంగా నెలరోజులుగా వివిధ శాఖల బాధ్యులు గ్రామ సచివాలయాల వారీగా మూడు పర్యాయాలు ఇప్పటికే ఇంటింటి ఆరోగ్య సర్వే చేశారని తెలిపారు. భాగంగా ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించారన్నారు. వారికి వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన ఇద్దరు ప్రత్యేక వైద్య నిపుణులు, స్థానిక పిహెచ్‌సికి చెందిన ఇద్దరు వైద్యులు, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో గల వైద్యశాలకు చెందిన ఒక ప్రత్యేక వైద్య నిపుణులు సేవలందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పద్మావతిదేవి, తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, డిప్యూటీ తహశీల్దార్ షేక్ షంషుద్దీన్, ఐసిడిఎస్ భీమడోలు సిడిపిఒ విజయలక్ష్మి, పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనేరు రంగారావు సిఫార్సులను నవరత్నాల్లో చేర్చాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోనేరు రంగారావు భూ కమిషన్ సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో చేర్చి భూములేని దళితులకు, ఇతర పేదలకు మిగులు భూములు, అడవి, బంజరు భూములు పంచాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈనెల 25, 26, 27 తేదీలలో బాపట్లలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభలో బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బండి వెంకటేశ్వరరావు ఎంపికయ్యారు. 1979లో అఖిలభారత విద్యార్థి సమైక్యలో చేరిన ఆయన విద్యార్థి సంఘంలో పట్టణ స్థాయి నుండి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేశారు. 1992 తర్వాత అఖిల భారత యువజన సమైక్య ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేశారు. 1998 నుండి సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహాయ కార్యదర్శిగా ప్రస్తుతం సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. 2006 నుండి వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, 2023లో జరిగిన ఏలూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మొదటి మహాసభలో జిల్లా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం సంఘం రాష్ట్ర 22వ మహాసభలో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు.



పొగాకు నారును పరిశీలిస్తున్న అధికారులు

బయో ఎరువులపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వర్జీనియా పొగాకు రైతులు బయోపెస్టిసైడ్స్, బయోఫెర్టిలైజర్స్ వినియోగంపై అవగాహన రైతులు పొందాలని పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ డి.దామోదర్ తెలిపారు. శుక్రవారం స్థానిక పొగాకు బోర్డువేలం కేంద్రం-32లో వర్జీనియా పొగాకుసాగులో బయో ఎరువుల తయారీ, వాడకంపై రైతులకు శిక్షణ, ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథులుగా పొగాకు బోర్డు ఎక్స్‌టెన్షన్ మేనేజర్ డి.దామోదర్, ఎన్ఐపిహెచ్ఎం సైంటిస్ట్ దామోదరచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర్ స్వయంగా బయో పెస్టిసైడ్, బయో ఫెర్టిలైజర్ తయారు చేసే విధానాన్ని రైతులకు చూపించారు. బయోఫెర్టిలైజర్, బయో పెస్టిసైడ్ వినియోగం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి నాణ్యమైన పొగాకు దిగుబడి వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్రకుమార్, పొగాకు బోర్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న నాయకులు

దళిత హక్కుల రక్షణకు సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల, పేదల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. గురువారం ఏలూరులో బిల్డింగ్ వర్కర్స్ సెంటర్లో దళిత హక్కులు - సామాజిక న్యాయం, అసైన్డ్ భూముల చట్ట సవరణ రద్దు చేయాలని కోరుతూ సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో దళితులపై దాడులు పెరిగాయని మండిపడ్డారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చి 41 సిఆర్‌పిసి ప్రకారం బెయిల్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలు చేయకపోగా వాటిని తుంగలో తొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు వారసత్వంగా వస్తున్న అసైన్డ్ భూముల చట్ట సవరణ చేసి అసెంబ్లీలో ఆమోదించడం దళితలు, పేదల భూములను భూస్వాములకు కట్టబెట్టటమే అవుతుందని విమర్శించారు. రాష్ట్రంలో దళితుల ఓటుతో గెలిచిన సిఎం జగన్ వారి ఉసురుతీస్తున్నారని విమర్శించారు. అలాగే 45 సంవత్సరాలు దాటిన డప్పు కళాకారులకు, చర్మకారులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. శ్మశానాలకు ఇచ్చిన జిఒ 1235 అమలుకు నోచుకోలేదన్నారు. దళిత, గిరిజనులకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు 300 యూనిట్లకు పెంచాలని కోరారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసి సంఘాలకు ఆ కమిటీల ప్రాతనిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 29న విజయవాడలో జరుగుతున్న మహాధర్నాలో దళితులు, పేదలు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు అందరూ హాజరు కావాలని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎం.ఇస్సాకు, పి.బాలరాజు, కిషోర్ పాల్గొన్నారు.

4న రాష్ట్ర సదస్సు జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో వచ్చేనెల నాలుగో తేదీన రాజమండ్రిలో జరిగే రాష్ట్రవ్యాప్త సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సిపిఎం కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను మండల కార్యదర్శి అధ్యక్షతన ఎ.రవి ఆవిష్కరించారు. అనంతరం రవి మాట్లాడుతూ ప్రధాని మోడీ ఎన్నికల సమయంలో బిజెపి అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ గాలికొదిలేశారన్నారు. ఇప్పటివరకూ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. దేశంపట్ల, యువత పట్ల చిత్తశుద్ధిలేని బిజెపి ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలన్నారు. అలాగే పాదయాత్రలో ప్రతీ సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలు కల్పిస్తానన్న వైఎస్.జగన్ ఇప్పటి వరకూ జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు పెద్ద ఎత్తున మూతపడుతున్నాయని తెలిపారు. జిల్లాలో చూస్తే ఏలూరులో జ్యూట్ మిల్ పరిశ్రమ మూతపడటం, భీముడోలు సుగర్ పరిశ్రమ మూతపడడంతో వేలాది మంది నిరుద్యోగులుగా రోడ్డునపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో 20 లక్షలకుపైగా ఉద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని ప్రభుత్వాలే లెక్కలు చెబుతున్నప్పటికీ ప్రభుత్వాల్లో చలనం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని అన్నారు. ఈ చట్టాన్ని పట్టణాల్లోనూ అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరుద్యోగులను, ప్రజా సంఘాలను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పసల సూర్యారావు, ఎ.ప్రభాకర్‌రావు, జి.సూర్యకిరణ్, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు వాహన మిత్ర ఐదో విడత నగదు విడుదల

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో వైఎస్ఆర్ వాహన మిత్ర పథకం ఐదో విడత కింద 10,490 మందికి రూ.10.49 కోట్లు ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈ నెల 29 తేదీన విజయవాడలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున జమచేయనున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఆటో, టాక్సీ, మాక్సీ క్యాబ్‌లు నడుపుతూ జీవనం సాగించే వారికి ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేస్తుందన్నారు. 2019 నుంచి ఇప్పటివరకూ నాలుగుసార్లు ఈ సాయాన్ని లబ్ధిదారులకు అందజేయగా, ప్రస్తుతం ఐదో విడత సాయాన్ని ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 2019-20లో 17,101 మందికి రూ.17.10 కోట్లు, 2020-21లో 19,521 మందికి రూ.19.52 కోట్లు, 2021-22లో 18,015 మందికి రూ.18 కోట్లు అందజేయగా, ఏలూరు జిల్లాలో 2022-23లో 10,303 మందికి రూ.10.30 కోట్లు ప్రభుత్వం అందజేసింది. ఐదో విడతగా 2023-24లో 10,490 మందికి రూ.10.49 కోట్లు శుక్రవారం విడుదల చేయనున్నట్లు తెలిపారు.

రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

జీపు యాత్ర ప్రారంభంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు లింగరాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్




ఏలూరులో మాట్లాడుతున్న లింగరాజు

రవాణారంగంలో పనిచేస్తున్న లక్షలాదిమంది కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. రవాణారంగ కార్మికుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం జీపుయాత్రను ఏలూరులోని పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన ప్రారంభించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.గోపి అధ్యక్షతన ప్రచార యాత్ర ప్రారంభ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రవాణారంగం ద్వారా రూ.లక్షల కోట్ల ఆదాయాన్ని సంపాదిస్తూ దానికి ప్రధాన కారణమైన రవాణారంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు ఇతర కార్మికుల సంక్షేమం కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవడం బాధాకరమన్నారు. కేరళ తరహాలో కార్మికుల సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, తద్వారా కార్మికులకు ఉపశమనం కలుగుతుందన్నారు. పెట్రోలు, డీజిల్‌పై పన్నులు వేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయని, పన్నులు తగ్గించడం ద్వారా రవాణా రంగం సంక్షోభం నుంచి బయటపడుతుందని ఆయన తెలిపారు. రోడ్డు, గ్రీన్, టోల్ టాక్స్‌లు అంటూ రకరకాల ఫైన్లు వేయడం వల్ల కార్మికులను, వ్యాపారులను ప్రభుత్వాలు పీల్చిపిప్పి చేస్తున్నాయని విమర్శించారు. సంక్షేమ బోర్డు సాధన కోసం అఖిలభారత రోడ్డు రవాణా కార్మికుల సంఘం వచ్చేనెల ఆరో తేదీన దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో చలో రాజభవన్‌కు పిలుపు ఇచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు జి.రవీంద్ర, బి.శ్రీనివాసరావు, బి.నాని పాల్గొన్నారు. అనంతరం ప్రచారయాత్రను పార్టీ సీనియర్ నాయకులు బి.సోమయ్య, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.సూరిబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్ర కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి, పెదపాడు మండలాల మీదుగా సాగుతుందని జె.గోపి తెలియజేశారు.

కలిదిండి: రవాణారంగంలోని లక్షలాది మంది కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపట్టిన జీపు యాత్ర కలిదిండి ప్రధాన సెంటర్‌కు గురువారం సాయంత్రం చేరింది. ఈ సందర్భంగా ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.గోపి అధ్యక్షతన జరిగిన ప్రచార సభలో ప్రసాద్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు జక్కుల మహేష్, చిన్నం శ్రీకాంత్, ప్రకాష్, ఆటో యూనియన్ నాయకులు జి.రవీంద్ర, బి.శ్రీనివాసరావు, దాసు, నాగార్జున పాల్గొన్నారు.

రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్ మృతి

ప్రజాశక్తి - కలిదిండి



నాగేంద్రనాథ్ (ఫైల్‌ఫొటో)

మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి భర్త, రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్ (చిట్టి బాబు) (78) గురువారం మృతి చెందారు. ఆయన గతకొంత కాలంగా అనారోగ్యానికి గురై ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షులుగా, రాష్ట్ర డ్రెయినేజీ బోర్డ్ సభ్యులుగా, కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్‌గా ఆయన విశేష సేవలందించారు. ఆయన స్వగ్రామం మండలంలోని కొండూరు గ్రామం. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కొండూరులోని ఆయన మృతదేహాన్ని మాజీమంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రాజు శ్రీనివాసరావు, నాయకులు బికెఎం.నాని, నరసింహారావు, నాగరాజు, నియోజక వర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏలూరు అర్బన్: రాష్ట్రంలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి తుదిశ్వాస విడిచే వరకూ పోరాడిన యోధుడు, రైతాంగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎర్నేని నాగేంద్రనాథ్ మృతికి ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. ఈ మేరకు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని రైతాంగ సమస్యలపై లోతైన అధ్యయనంతో నిత్యం తన వాణిని ఎర్నేని నాగేంద్రనాథ్ వినిపించేవారని, ఆయన మృతి రైతాంగ ఉద్యమాలకు తీరనిలోటని పేర్కొన్నారు. కనీస మద్దతు ధరల నిర్ణయించడంలో ప్రభుత్వాలు చేస్తున్న మోసం పట్ల నిత్యం ప్రశ్నించే వారని, నిస్వార్థంగా అంకితభావంతో రైతాంగ ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు.

వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్ మృతికి సంతాపం

హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్.స్వామినాథన్(98) మృతికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సంతాపం తెలిపారు. ఆహార వృద్ధిలో మన దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు ఆయన ఎంతో కృషి చేశారని, తన పరిశోధనలతో మేలైన వరి వంగడాలను సృష్టించారని తెలిపారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, రామన్ మెగసెసె వంటి ఎన్నో పురస్కారాలు అందుకున్నారని పేర్కొన్నారు.

నూజివీడు రూరల్ సిఐగా బాల సురేష్‌బాబు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాల సురేష్ బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సిఐగా విధులు నిర్వర్తించిన అంకంబాబు ఉన్నతాధికారుల ఆదేశానుసారం సాధారణ బదిలీ కాగా, నూతన సీఐగా సురేష్ బాబు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు రూరల్ సర్కిల్ పరిధిలో ఉన్న నాలుగు పోలీస్ స్టేషన్లకు సంబంధించిన గ్రామీణ ప్రాంతాలలో శాంతి భద్రతల పరిరక్షణ తన ధ్యేయంగా పనిచేస్తానని సీఐ తెలిపారు.

డిజిరేఖతో ట్రిపుల్ ఐటీ ఒప్పందం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ట్రిపుల్ ఐటీలో హైదరాబాద్‌కు చెందిన డిజి రేఖ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం విదేశాల్లో చదువుకోవాలనుకునే ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు డిజి కంపెనీ మూడు సంవత్సరాల జిఆర్ఇ, టోఫెల్, ఐఇఎల్‌టిఎస్, తదితర కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తుంది. ఈ ఒప్పందంపై నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జివిఆర్.శ్రీనివాసరావు, డిజి కంపెనీ డైరెక్టర్ ఆచార్య చాడా.జగదీశ్ రెడ్డి సంతకాలు చేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని తిరువూరు బస్టాండ్ సమీపంలో ఉన్న చిన్న మసీదు వద్ద ఈద్ ఏ మిలాద్ ఉన్ నబి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మసీదులో ప్రత్యేక నమాజ్ నిర్వహించి, జెండాలను అలంకరించి, పట్టణ ప్రధాన రహదారులలో ముస్లీం సోదరులు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లీం యువనేత మున్ని మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త పుట్టినరోజును మిలాద్ ఉన్ నబీగా నిర్వహిస్తున్నామన్నారు. ఐక్యతతో పేదలకు సహాయం చేశామని తెలిపారు.

పోలవరం : గ్రామంలో అహలే సున్నత్ జమాతే మసీదు కమిటీ అధ్యక్షులు యాసీన్ షరీఫ్ ఆధ్వర్యంలో గురువారం పోలవరం మండల కేంద్రంలో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రాష్ట్రమంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అల్లాని కోరారు. ప్రధాన రహదారులు వెంట ముస్లీం జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుని, ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సందని, కోశాధికారి షేక్ సలీమ్, మహ్మద్ బాషా, పఠాన్ కాజా, ముస్లీం సోదరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో గురువారం గణేష్ నిమజ్జనాలు, ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని సింగరాయపాలెం, పెదపాలపర్రు, గురజ, వడాలి, పెదకామనపూడి, వాడవల్లి, వణుదుర్రు, దేవపూడి, వైవాక, ఊటుకూరు, ముదినేపల్లి తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు, ఊరేగింపులు ఘనంగా ఉత్సవ కమిటీసభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లు, వివిధ వాహనాలపై గణేష్ విగ్రహాలు ఉంచి గ్రామాల్లో ఊరేగింపు చేశారు. తీన్‌మార్ డప్పులు, డిజె సౌండ్స్‌తో పాటలకు యువకులు, పెద్దలు, పిల్లలు పెద్దఎత్తున పాల్గొని వీధుల్లో నృత్యాలు చేస్తూ గులాం చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. అనంతరం వినాయక విగ్రహాలను ఆయా గ్రామాల్లోని పంట కాల్వల్లో నిమజ్జనాలు చేశారు. ఊరేగింపులు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు. పలు గ్రామాల్లో ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఉత్సవ కమిటీ సభ్యులు అన్న సమారాధనలు నిర్వహించారు.

వాసవీమాత ఆలయానికి విరాళం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

వాసవి మాత ఆలయానికి నూజివీడు మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య రూ.5,616 విరాళం అందించినట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.గోపి, వనమా వెంకటేశ్వరరావులు అన్నారు. ఈ సందర్భంగా రామకోటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా మేయర్ నూర్జహాన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మాజీ డిప్యూటీ సిఎం, ఏలూరు ఎంఎల్ఎ ఆళ్లనాని ఫోన్‌లో మేయర్ నూర్జహాన్ పెదబాబుకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంఎల్ఎ నాని ఇంటికి వెళ్లి నాని గారి ఆశీస్సులు తీసుకున్నారు. పవర్ పేటలోని మేయర్ గారి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలకు నగరంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, మున్సిపల్ అన్ని సెక్షన్ హెడ్స్, గ్రామ వార్డు, సచివాలయాల సెక్రటరీలు పెద్ద ఎత్తున తరలివచ్చి నూర్జహాన్ పెదబాబు గారికి శుభాకాంక్షలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

చెట్టుకూలి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

చెట్టుకూలి వ్యక్తి మృతి చెందిన సంఘటన లోపూడి గ్రామంలో చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన కూసం ధర్మరావు(50) గురువారం సాయింత్రం తమ పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్లగా, భారీ వర్షంతో పాటు పెద్ద పెద్దగా శబ్దాలతో కూడిన ఉరుములు, మెరుపులతో రావడంతో చెట్టుకూలిపోయింది. దీంతో తమ పొలంలో వున్న మామిడి చెట్టు కింద నిల్చుని వుండటంతో, ఆ మామిడి చెట్టు మీద పడి ధర్మారావు సంఘటనా స్థలంలో మృతి చెందాడు. తమ భార్య, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

దాడికేసులో ముగ్గురికి రిమాండ్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వైన్‌షాప్‌కు వెళ్లి మద్యం తీసుకొని రమ్మంటే తీసుకురాలేదని, ఒక వికలాంగుడిపై ముగ్గురు యువకులు దుడ్డుకర్రలతో విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన మండల పరిధిలోని ఈదర గ్రామంలో చోటుచేసుకుంది. ఆగిరిపల్లి ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపిన వివరాల ప్రకారం ఈదర గ్రామానికి చెందిన వికలాంగుడు దొండపాటి రమేష్, అదే గ్రామానికి చెందిన పులి సుమంత్, దొండపాటి జోజిబాబు, బోకినాల సీతారామరాజు వైన్‌షాప్‌కు వెళ్లి మద్యం తీసుకొని రావాల్సిందిగా కోరగా, అందుకు నిరాకరించారిని రమేష్‌పై విచక్షణా రహితంగా దాడి చేశారు. సదరు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని నూజివీడు కోర్టునకు హజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వాకింగ్ చేస్తున్న ఒక మహిళ మెడలోని గొలుసుని గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు అపహరించుకుపోయారు. ఏలూరు హనుమాన్ నగర్‌కు చెందిన శ్యామలపల్లి పద్మావతి గురువారం ఉదయం ఏలూరు పంపుల చెరువు వద్ద వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసును తెంపుకుని ఆపై మోటారు సైకిల్‌పై పరారీ అయ్యారు. బంగారు గొలుసు 25 గ్రాములు ఉంటుందని, బాధితురాలు గురువారం రాత్రి ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు వస్తువులు చోరీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు వస్తువులు అపహరించుకుపోయారు. ఏలూరు సమీపంలోని వట్లూరుకు చెందిన చెట్టిపల్లి కృష్ణకిషోర్ ఈనెల 26వ తేదీన ఉదయం తన ఇంటికి తాళం వేసి ఏలూరు పనిమీద వెళ్లారు. సాయంత్రం తిరిగి వెళ్లేటప్పటికి ఇంటి తలుపులు తీసి ఉన్నాయి. ఇంటిలోని బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. బీరువాలోని మూడు కాసులు నల్లపూసల గొలుసు అపహరణకు గురైందని గుర్తించారు. ఈ సంఘటనపై గురువారం రాత్రి ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిఐ కోమాకుల శివాజీ ఆధ్వర్యంలో ఎస్ఐ శంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతకు భగత్‌సింగ్ స్ఫూర్తి

ఘనంగా 116వ జయంతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భగత్‌సింగ్ ఆశయాలు నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని సిపిఎం నాయకులు ఎన్‌వి.అప్పారావు తెలిపారు. గురువారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో జయంతి ఉత్సవాలను నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం యువత భగత్‌సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెలటూరి నిర్మల, కెచ్చల రమణ, కాలనీ కమిటీ సభ్యులు అక్బర్, సీత, మణి, సూర్యకుమారి, రామకృష్ణ పాల్గొన్నారు.


జీలుగుమిల్లిలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, మహిళలు



చింతలపూడిలో నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

చింతలపూడి : భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని అఖిలభారత యువజన సమైక్య ఎఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటిరాజు తెలిపారు. భగత్‌సింగ్ 116వ జయంతి సందర్భంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో స్వాతంత్ర పోరాటంలో దేశంలో యువతను ఆకర్షించి, పోరాట మార్గాన్ని ఎంచుకున్న వ్యక్తి భగత్ సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత యువజన సమైక్య ఎఐవైఎఫ్ మాజీ నాయకులు కంచర్ల గురవయ్య, తొర్లపాటి బాబు, గట్టు వెంకటేశ్వరరావు, ఎఐవైఎఫ్ నాయకులు బొల్లవరపు విజయ శేఖర్, బత్తుల రఘు, బొంతు నవీన్ నివాళులర్పించారు.

ఏలూరు అర్బన్ : విప్లవ వీరుడు సర్దార్ భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా స్థానిక 39 డివిజన్ భగత్‌సింగ్ సెంటర్‌లో భగత్‌సింగ్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వర్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, సిపిఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు, యర్రా వెంకటేశ్వర్లు పూలదండ లేసి భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడి భారతదేశానికి స్వాతంత్రం రావడంలో ప్రముఖ పాత్ర వహించిన సర్దార్ భగత్‌సింగ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు.


ఏలూరులో నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

టి.నరసాపురం : స్థానిక విజన్ యుపి స్కూల్‌లో భగత్‌సింగ్, గుర్రం జాషువాల జయంతి వేడుకలను గురువారం ప్రధానోపాధ్యాయులు పురం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అరసం రాష్ట్ర కార్యదర్శి బిఎన్ సాగర్ మాట్లాడుతూ ఒకపక్క కార్పొరేట్ శక్తులు, మరోపక్క మతోన్మాద ఫాసిస్టు మూకల దాడుల నుంచి దేశాన్ని రక్షించడానికి భగత్ సింగ్ చేసిన త్యాగాలను, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.విజయ లక్ష్మి, కె.మహా లక్ష్మి, టి.అరుణ, జి.వరలక్ష్మి, కె.ఎస్తేరు రాణి, బి.పుష్పావతి, కె.రాజేశ్వరి, జి.రమ్యశ్రీ, వి.మౌనిక పాల్గొన్నారు.



టి.నరసాపురంలో మాట్లాడుతున్న సాగర్

ప్రభుత్వాసుపత్రి భవనం పరిశీలన

ప్రజాశక్తి-నూజివీడు రూరల్:

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం పరిశీలించారు. ప్రతి దశలోనూ నాణ్యతను పరిశీలిస్తూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్ర సింగ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ టీం సిద్ధం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు నుంచి రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు కృష్ణాజిల్లా జట్టు సిద్ధమైనట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యజ్ఞ నారాయణ తెలిపారు. ధర్మ అప్పారావు కళాశాల ఆవరణంలో ఆయన గురువారం మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పోటీపడేందుకు క్రీడాకారులు శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. మార్టూరులో నిర్వహించే పోటీలలో జిల్లా ఖ్యాతి దశ దిశలా వ్యాపింపజేయాలని కోరారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని ఉప్పాకపాడు పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అల్లు శ్రీను, నాగమణి దంపతులు, కుమార్తె పూజిత గురువారం సాయిబాబా గుడి వద్ద తాడేపల్లిగూడెంలో అనాథలకు 55 దుప్పట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పారితోషికం రూ.20 వేలులో సుమారు రూ.10 వేలు విలువగల 55 దుప్పట్లు నిరుపేదలకు, అనాథలకు పంపిణీ చేశారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రజాశక్తి - చాట్రాయి

'ఆరోగ్యమే మహాభాగ్యం' అని, మనిషి ఎంత సంపాదించినా ఆరోగ్యంగా లేకపోతే అంతా వృధా అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని ఆరుగొలను పేట గ్రామంలో ఎంపీపీ పాఠశాల వద్ద గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. లైన్స్‌క్లబ్ విస్సన్నపేట, పుట్టగుంట వెంకట సతీష్ హెల్త్ ఫౌండేషన్ సహకారంతో జనార్థనవరం, ఆరుగొలనుపేట ఎంపిటీసీ సభ్యులు కృష్ణ బోర్వెల్స్, ఎర్త్ మూవర్స్ పోతిరెడ్డిపల్లి కృష్ణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం ప్రారంభ సభలో పాల్గొని దేశిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ వేలకు వేలు డబ్బులు ఖర్చు పెట్టినా దొరకని వైద్యం ఉచితంగా మన గ్రామానికి వచ్చి వైద్య పరీక్షలు చేయటం, మనందరి అదృష్టమని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్స్ వైద్యులు కామినేని అచ్యుత బాబు, అమరావతి హాస్పిటల్స్ వైద్యులు, మణిపాల్ హాస్పిటల్స్ వైద్యులు, దూహిత డెంటల్ హాస్పిటల్స్ వైద్యులు, సిబ్బంది పాల్గొని వందలాది మందికి షుగర్, బిపి, కిడ్నీ, గుండె, కంటి, పంటి, నొప్పుల వైద్య పరీక్షలు చేసి, వ్యాధులు ఉన్నవారికి సంబంధిత మందులు వాడాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పుచ్చకాయల అప్పిరెడ్డి, లైన్స్‌క్లబ్ సభ్యులు శ్రీనివాసరావు, లక్ష్మయ్య, జానుబాబు, మిద్దె శివరామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేశిరెడ్డి రాఘవరెడ్డి

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్ఎ


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బాలరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో వైసిపి పరిపాలన సాగుతోందని పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని అల్లంచర్ల, రాజుపాలెం, కొత్తగూడెం గ్రామాల్లో గురువారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాలరాజు ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శకంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారునికి అందజేస్తున్నామన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు, ఎంపిపి డి.లక్ష్మి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ శ్రీను రాజు, ఎంపిటిసి బొడ్డపాటి రాంబాబు, వాసిరెడ్డి మధు, బోళ్లా రంగారావు, ములకయ్య, కె.సత్తిపండు, బొల్లారపు రాజు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు


ముసునూరులో న్యాయదేవతకు నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నేతలు


టి.నరసాపురంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - ముసునూరు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టునకు నిరసనగా గురువారం మండల కేంద్రమైన ముసునూరు మండపం సెంటర్ వద్ద న్యాయదేవత న్యాయపక్షాన్న వుండి మా చంద్రబాబు నాయుడికి న్యాయం జరిగేలా చూడమని టిడిపి నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దే రఘుబాబు, లక్కపాము కాంతారావు, రాపర్ల ప్రతాప్, గద్దల మెహానరావు, పర్వతనేని వెంకటేశ్వరరావు, సుగసాని వేణు, ఏనుగుధాటి నాగరాజు, రంగు వాసు, పల్లిపాము జీవరత్నం, చలమాల వెంకటేశ్వరరావు, రెడ్డి కృష్ణ, నక్కా యోహాన్ న్యాయదేవతను వేడుకోన్నారు.

టి.నరసాపురం : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు విడుదల కోరుతూ మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పుర వీధుల్లో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కడిగిన ముత్యంలా చంద్రబాబు బయటికి వస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట నాయుడు, పండు, వడ్డే శ్రీను, ఎం.దుర్గా రావు, ఎం.సురేష్, టి.శ్రీను, సిహెచ్ వీర బాబు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : చంద్రబాబు నాయుడు అరెస్టుపై టిడిపి శ్రేణులు చేపట్టిన నిరసన దీక్ష గురువారం కొనసాగింది. టిడిపి ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన రిలే నిరాహార దీక్ష 17వ రోజుకు చేరుకుంది. నిరసన దీక్షకు సంఘీభావం తెలిపిన అమరావతి జెఎసి కన్వీనర్ కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు పెట్టి 19 రోజులైన తర్వాత కూడా ఎటువంటి ఆధారాలు తెలపకుండా రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యాలయం ఇన్‌ఛార్జి, పాలి ప్రసాద్, పరిమి సత్తిపండు, రామారావు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే బాలికల రక్షణ

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బులికృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

బాలలు ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి వెళ్లకుండా ముందుగానే అప్రమత్తంగా, అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, కార్యదర్శి జిల్లాన్యాయ సేవాధికారి కెకెవి.బులికృష్ణ తెలిపారు. ఏలూరు మండలంలోని వన్ టౌన్ ఏరియా పరిధిలో ఉన్న హోటల్ ఆదిత్య సెంట్రల్ నందు చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ క్రాఫ్ వారి ఆధ్వర్యంలో బాలల పంచాయతీ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బులికృష్ణ మాట్లాడుతూ బాల కార్మికులుగా ఎవరూ ఉండకూడదని, ప్రతిఒక్కరి పిల్లలు చదువుకొని ఉన్నత స్థాయిలో అభివృద్ధి చెందాలని సూచించారు. సోషల్ మీడియా వల్ల వచ్చే నష్టాలు గురించి తెలుసుకొని సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని వివరించారు. ముఖ్యంగా బాలికలు చెడు స్పర్శ, మంచి స్పర్శ గురించి తెలుసుకొని, తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, లైంగిక దోపిడీ నుంచి రక్షణ పొందాలని బాలలకు వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బాలల హక్కులు గురించి, తెలుసుకొని చదువుకునే వయసులో చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. పిల్లలందరూ మంచి విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డిప్యూటీ అసిస్టెంట్ సీనియర్ సిటిజన్ సిహెచ్‌జి.ప్రభాకర్ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడుకుంటూ అభివృద్ధి చెందాలని బాలలకు ఉన్న నాలుగు హక్కులను కాపాడే ప్రదేశం బడి ఒక్కటేనన్నారు. ఏలూరు మండల తహశీల్దార్ బి.సోమశేఖర్ మాట్లాడుతూ బాల బాలికలకు స్కూల్‌లో వసతులన్నీ పొందుతున్నాయా లేదా అనే అంశంపై పరిశీలన చేస్తామన్నారు. బాలికలకు ఎటువంటి ఇబ్బందులేర్పడిన ఎంఇఒకు తెలియజేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్య చక్రవేణి, చైల్డ్‌రైట్స్ అడ్వకశి ఫౌండేషన్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ పి.ఫ్రాన్సిస్ తంబి, బాల బాలికలు, బాల పంచాయతీ పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాలపై అణచివేత తగదు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రజాస్వామిక ఉద్యమాలపై అణచివేత వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం వీడాలని ఐఎఫ్‌టియు, రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సమావేశం స్థానిక సంఘం జిల్లా ఆఫీస్‌లో జిల్లా అధ్యక్షుడు కెవి.రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఇఫ్టూ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రజలకు తమ నిరసన వ్యక్తం చేసే అవకాశం కూడా ఇవ్వకుండా అణచివేత వైఖరితో, ఫాసిస్ట్ పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీలు తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని విజయవాడ చేరుకున్న వేలాది మందిని బలవంతంగా వ్యానులో ఎక్కించి వారిని గాయపరిచారని విచారణ వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తే వారిని కొట్టి అరెస్టు చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో ఉద్యమాలపై ఈ విధమైన అణచివేత ధోరణి కొనసాగిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని యువి హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బద్ధ వెంకట్రావు, జిల్లా నాయకులు ఇ.గ్రీష్మ కుమార్, ఎండి ప్రసాద్, ఎర్రా శ్రీను పాల్గొన్నారు.


వర్షంలో చిన్నారుల కేరింతలు

వర్షానికి నీట మునిగిన రోడ్లు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని లక్కవరం ఎస్‌సి కాలనీలో సీసీ రోడ్లు నీట మునిగాయి. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. దీంతో చిన్నారులు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో కేరింతలు కొడుతూ జలకాలాడారు. వర్షపు నీరు తరలిపోకుండా డ్రెయినేజీలు దుర్భరంగా ఉండడంతో వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్లు మునిగిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజి పూడిక పనులు వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు.


ఎంపికైన హీల్ విద్యార్థులు

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు హీల్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు మండల పరిధిలోని హీల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లుగా ప్రిన్సిపల్ బి.సాయిబాబు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారు నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో 14 సంవత్సరాల విభాగంలో నలుగురు బాలికలు, ఒక బాలుడు, 17 సంవత్సరాల విభాగంలో ఒక బాలిక, ముగ్గురు బాలురు ఎంపికైనట్లుగా ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్ సాయిబాబు, కోచ్ ప్రేమ్ తేజ, ఫిజికల్ డైరెక్టర్స్ ప్రభుదాసు, శ్రీనివాసరెడ్డి, బాస్కెట్‌బాల్ కోచ్ చాందినిలు అభినందించారు.

నేడు భవ్యశ్రీ సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

భవ్యశ్రీపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ, సంఘీభావంగా ఆగిరిపల్లి పురవీధుల్లో శుక్రవారం పార్టీలకతీతంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని సామాజిక సంఘం నాయకులు తెలిపారు. పలు పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనవల్సిందిగా వారు కోరారు.

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలకేంద్రమైన ముదినేపల్లిలో గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. గ్రామంలోని అన్ని వీధుల్లో మలాథిన్ ద్రవణాన్ని పిచికారి చేశారు. గ్రామంలో జ్వరాలు అధికంగా ఉండడం వల్ల దోమల నిర్మూలన కోసం మందును పిచికారి చేసినట్లు గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ తెలిపారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పిచికారి పనులను సర్పంచి కైకమ్మ బిక్షాలు దగ్గరుండి పర్యవేక్షించారు.

CHANGE OF NAME

I, **CHIRGA RAJARAMESH, S/o.Chirga Narayana (old Name),** R/o. H.No.1-66, Sivapuram, Chinthalapudi Mandal, West Godavari District 534460. I, have changed my name to **CHIRAGA RAJARAMESH,** S/o. **Chiraga Narayana (New Name)** For All purposes

IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT::HAYATHNAGAR O.S.No. 804 OF 2021

BETWEEN:-
Gunda Ramulu ...Plaintiff
AND
Tummala Veera Venkata Bala Gangadhara Tilak& Another ...Defendants

To,
D-1. Tummala Veera Venkata Bala Gangadhara Tilak, S/o.T. Nageshwara Rao, Aged about 40 Years, Occ: Private Service, R/o.Polangi(PO), Vundrajavaram, Tanuku (Tq), West Godavari District, A.P

The plaintiff herein had filed the above suit for Declaration of title & amp; Consequential Injunction & declare Regd.Sale Deed as null and void not binding on plaintiff in respect of suit schedule property against the defendants including you.

The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 04.10.2023 at 10.30 a.m. Therefore you may appear before the Hon'ble Court either personally of through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of law.

Hence this notice
[BY ORDER OF THE COURT]

Sd/-
M/s. N. PANDU,
Advocate.
Shobanagar Colony, Turkayamjal,
Rangareddy District.